సాక్షి నంద్యాల

శనివారం । 3 । ఫిబ్రవరి । 2024



భ్రామరీకి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఉంచి ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు.



అలరించిన సంగీత విభావరి

శ్రీశైలంటెంపుల్: ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన ఎం.రాజ్యలక్ష్మి బృందం నిర్వహించిన భక్తి సంగీత విభావరి అలరించింది.



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో అన్నదాన పథకానికి ఎమ్మిగనూరుకు చెందిన డి.విమలాక్షమ్మ శుక్రవారం రూ.లక్ష విరాళాన్ని ఆలయ పర్యవేక్షకురాలు హిమబిందుకు అందజేశారు.

న్యూస్‌రీల్

డీఆర్వో బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న డీఆర్వో పద్మజ

నంద్యాల (అర్బన్): నంద్యాల జిల్లా రెవెన్యూ అధికారిణిగా పద్మజ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న పుల్లయ్య చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. అదే విధంగా నంద్యాల ఆర్‌డీఓగా మల్లికార్జునరెడ్డి బాధ్యతలు చేపట్టగా నంద్యాల మండల ఎంపీడీఓగా సౌభాగ్యమ్మ శనివారం బాధ్యతలు చేపట్టనున్నారు.

నాణ్యమైన పొగాకు వంగడాలు



పొగాకు పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

నంద్యాల (సెంట్రల్): నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో సాగుచేసిన పొగాకు వంగడాలు నాణ్యమైన మంచి దిగుబడులను ఇచ్చే విధంగా ఉన్నాయని అఖిలభారత పొగాకు పరిశోధన స్థానం (ఐసీఏఆర్-సిటీఆర్ఐ) రాజమండ్రి నుంచి వచ్చిన నోడల్ ఆఫీసర్ సస్యప్రజనన విభాగాధిపతి డాక్టర్ కె. సరళ, సస్య విభాగాధిపతి డా.ఎస్. కస్తూరి కృష్ణ అన్నారు. శుక్రవారం వారు పరిశోధన స్థానంలో డాక్టర్ ఎన్.సీ వెంకటేశ్వర్లుతో కలిసి పరిశోధన కోసం సాగుచేసిన పొగాకు క్షేత్రాలను పరిశీలించారు. శాస్త్రవేత్తలు పుల్లీబాయి, సతీష్ కుమార్ రోజువారి పరిశోధనల గురించి వారికి వివరించారు. ఈ సందర్భంగా అధికారులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పొగాకు సాగు పెరుగుతోందని తదనగుణంగా ఇక్కడ పరిశోధనలు సైతం సంతృప్తికరంగా సాగుతున్నట్లు కితాబునిచ్చారు.

పారారోయింగ్‌లో ప్యాపిలి క్రీడాకారుడి ప్రతిభ



వెంకటనారాయణ

ప్యాపిలి: మహారాష్ట్రలో జరిగిన జాతీయ పారా రోయింగ్ పోటీల్లో ప్యాపిలికి చెందిన వెంకటనారాయణ ప్రతిభ చాటాడు. జనవరి 28 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు పూణేలో జరిగిన ఈ పోటీల్లో హర్యానా, తమిళనాడు, మహారాష్ట్ర, కేరళ తదితర రాష్ట్రాల క్రీడాకారులతో ఆంధ్రప్రదేశ్ తరఫున వెంకటనారాయణ తలపడ్డాడు. రెండు కిలోమీటర్ల దూరాన్ని 8 నిమిషాల 10 సెకన్లలో రోయింగ్ చేసి బంగారు పతకాన్ని సాధించాడు. 500 మీటర్ల దూరాన్ని 1 నిమిషం 55 సెకన్లలో సాధించి బంగారు పతకాన్ని సాధించాడు. పారా రోయింగ్‌లో ప్రతిభ చాటిన వెంకటనారాయణను స్థానికులు అభినందించారు.

పింఛన్ల పంపిణీ 93 శాతం పూర్తి



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న షేక్‌ఖాశీంబీకి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ హుసేన్‌బాషా

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో ఫిబ్రవరి నెల వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. పింఛన్ల పంపిణీ శుక్రవారం ఉదయం తెల్లవారుజాము నుంచి పంపిణీ జరుగుతోంది. ఈనెల 5వ తేదీ వరకు పింఛన్ల పంపిణీ జరుగుతుందని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. నంద్యాల జిల్లాలో 2,24,398 ఉండగా ఇప్పటి వరకు 2,08,836 మందికి (93 శాతం) పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. వృద్ధాప్య, వికలాంగులు, హెల్త్ పింఛన్లు పొందుతున్న వారిలో 60 ఏళ్ల పైబడిన వారు ఆర్‌బీఐఎస్ ముఖ గుర్తింపు ద్వారా పింఛన్ పొందే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు.

నిలకడగా ఎండుమిర్చి ధరలు

నంద్యాల (సెంట్రల్): పట్టణంలోని మిర్చి మార్కెట్ యార్డులో సూపర్ 10 మిర్చి రకం ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. శుక్రవారం ఈ రకం జనరల్ గరిష్ఠ ధర క్వింటాలు రూ.16,400, మధ్యస్థ ధర రూ.15,000, కనిష్ఠ ధర రూ. 13,400గా నమోదైంది. ఇదే రకం తాలుకాయ జనరల్ గరిష్ఠ ధర రూ.5,600, మధ్యస్థ ధర రూ.5,200, కనిష్ఠ ధర రూ.5,000గా పలికినట్లు యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి కల్పన ఓ ప్రకటనలో తెలిపారు.



కోవెలకుంట్ల మండలం బిజనవేములలో మగ్గంపై పట్టు చీర నేస్తున్న చేనేత కార్మికురాలు

చేనేతకు నేస్తమై.. మగ్గానికి ఆధారమై

- సర్కారు సాయంతో కోలుకున్న చేనేత పరిశ్రమ
- నేతన్న నేస్తం ద్వారా ఏటా రూ. 24 వేలు ఆర్థిక సహాయం
- జిల్లాలో 848 మందికి లబ్ధి
- 4,483 మంది చేనేత కార్మికులకు ప్రతి నెలా పింఛన్‌కానుక

నియోజకవర్గాలవారీగా ఇప్పటి వరకు చేకూరిన లబ్ధి		
నియోజకవర్గం	లబ్ధిదారుల సంఖ్య	చేకూరిన లబ్ధి
బనగానపల్లె	495	రూ.5.94 కోట్లు
నంద్యాల	40	రూ.48 లక్షలు
ఆళ్లగడ్డ	55	రూ.66 లక్షలు
శ్రీశైలం	27	రూ.32.40 లక్షలు
నందికొట్కూరు	14	రూ.16.80 లక్షలు
డోన్	217	రూ.2.60 కోట్లు

కోవెలకుంట్ల: చతికిలబడిన చేనేత కార్మికుల జీవితాలు పునర్జీవం పోసుకున్నాయి. ఐదేళ్ల క్రితం వరకు అటకెక్కిన మగ్గాలు మళ్లీ నిర్విరామంగా పనిచేస్తున్నాయి. చేనేతకు ఆదరణ లేక వలస బాటపట్టిన కుటుంబాలు తిరిగి నేత వృత్తినే జీవన భృతిగా మార్చుకున్నాయి. ఆదాయం లేక అణగారిన కార్మికుల స్థితిగతులు నేడు గాడిలో పడ్డాయి. పొట్ట పోషణకే ఇక్కట్లు పడిన జీవితాలు ప్రస్తుతం చేతినిండా పనితో దర్జాగా కాలం వెల్లదీస్తున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ద్వారా చేనేతల కుటుంబాలకు అండగా నిలిచింది. ఏటా రూ. 24 వేలు ఆర్థికసాయం అందజేస్తూ ఆ కుటుంబాల్లో వెలుగులు నింపింది. ఈ పథకంతో చేనేత కార్మికుల స్థితి గతులను మార్చి మెరుగైన జీవన ప్రమాణాలను పెంచడమే లక్ష్యంగా అమలు చేస్తున్నారు. జిల్లాలోని 29 మండలాల పరిధిలో 848 మంది మగ్గాలు కలిగిన చేనేత కార్మికులు ఉన్నారు. సుమారు 3,500 మంది ఈ వృత్తిపై పరోక్షంగా ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. కుదేలైన చేనేత పరిశ్రమకు పునర్జీవం పోసేందుకు ప్రభుత్వం 2019 డిసెంబర్ 21వ తేదీన నేతన్న నేస్తం పథకాన్ని ప్రారంభించింది. కరోనా లాక్‌డౌన్ సమయంలో ఆర్డర్లు లేక దిక్కు తోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్న చేనేత కార్మికులకు వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం అండగా నిలిచింది. ఆ సమయంలో ప్రభుత్వం రెండవ విడత ఆర్థికసాయాన్ని ఆరు నెలల ముందుగానే అందజేసి కార్మికులను అన్ని విధాలా ఆదుకుంది. ఈ మేరకు ఐదు విడతల్లో జిల్లాలోని ఒక్కో చేనేత కుటుంబం రూ. 1.20 లక్షల సాయం అందుకుంది. ఇప్పటి వరకు ఐదు విడతల్లో చేనేతలకు రూ. 10.17 కోట్లు ఆర్థికసాయం అందింది. ఈ సాయంతో నేతన్నలు ఫెడల్ లూమ్స్, నూతన డిజైన్లు ఇచ్చే జక్కార్డ్‌లు, బాబిన్లు, కొనుగోలు చేసుకున్నారు. వృత్తిని సాంకేతికంగా మార్పు చేసుకుని అభివృద్ధి పథంలో పయనిస్తున్నారు. గతంలో పనిలేక అవస్థలు పడిన చేనేతలు ఇప్పుడు చేతి నిండా పనులతో జీవన ప్రమాణాలకు మెరుగులు దిద్దుకున్నారు.

నాడు టీడీపీ హయాంలో..

వర్షాకాలంలో చేనేత పరిశ్రమకు అంతరాయం కలుగుతున్నందున నెలకు రూ. 4 వేలు చెల్లిస్తామన్నారు. వంద యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చారు. ఆరోగ్య బీమా, చేనేత కార్మికులకు ఇళ్లు, షెడ్లు, పట్టణాల్లో జీ+3 భవనాలు అంటూ దాదాపు 18 జీఓలు విడుదల చేసింది. అయితే అవి కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. టీడీపీ హయాంలో చేనేతలకు ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు. టీడీపీ ప్రభుత్వ విధానాలతో చేనేత రంగం పూర్తిగా దెబ్బతినింది. అరకొర నిధులతో వీవర్స్ వెల్ఫేర్ ప్యాకేజీ అంటూ హడావిడి చేసి చేతులు దులుపుకుంది. ఆదరణ పథకం కింద డబ్బులు కట్టించుకుని అరకొర సామగ్రి ఇచ్చి మమా అనిపించారు. నేతన్నలు తమను ఆదుకోవాలని ఎన్నిమార్లు విన్నవించుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదు.

నేడు వైఎస్సార్‌సీపీ పాలనలో..

జిల్లా వ్యాప్తంగా 848 మంది చేనేత కార్మికులకు నేతన్న నేస్తం అందిస్తున్నారు. ఇప్పటి వరకు ఐదు విడతల్లో రూ. 10.17 కోట్లు పంపిణీ చేశారు. వృద్ధులై వృత్తిని విడిచిపెట్టిన 4,483 మంది నేత కార్మికులకు ప్రతి నెలా రూ. 3 వేల చొప్పున ఫించన్ అందిస్తున్నారు. 100 మంది చేనేత కార్మికులకు రూ. 50 లక్షల బ్యాంకు రుణాలు అందించారు. 90 మంది లబ్ధిదారులకు సబ్సిడీపై మగ్గాలు, వ్యక్తిగత వర్క్‌షెడ్లను 90 శాతం సబ్సిడీతో అందించారు. ఏటా లబ్ధి చేకూరుస్తూ చే నేత పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకొచ్చారు. మరో వైపు జిల్లాలో ఉత్పత్తి అవుతున్న చేనేత వస్త్రాలను ఇండియన్ హ్యాండ్‌లూమ్ బ్రాండ్ పేరుతో మార్కెటింగ్ చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో చేనేతల్లో మరింత ఉత్సాహం కనిపిస్తోంది.

ఆదరణ పెంచేందుకు ప్రభుత్వం చర్యలు

జిల్లాలో ఉత్పత్తి అవుతున్న చేనేత వస్త్రాలకు వినియోగదారుల నుంచి ఆదరణ పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో మార్కెటింగ్ చేసుకునేందుకు వీలుగా ఇండియన్ హ్యాండ్‌లూమ్ బ్రాండ్ పేరుతో విక్రయించేందుకు కసరత్తు చేస్తోంది. ముందుగా చేనేత వస్త్రాల తయారీలో విశేషంగా రాణిస్తున్న చేనేత సహకార సంఘాలను గుర్తించి ఇండియన్ హ్యాండ్‌లూమ్ బ్రాండ్‌లో రిజిస్ట్రేషన్ కోసం వివరాలు నమోదు చేసే కార్యక్రమాన్ని నంద్యాల జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లాలో ఆళ్లగడ్డలోని నీలకంఠేశ్వర చేనేత సహకార సంఘం, బనగానపల్లెలోని నందివర్గం, కోవెలకుంట్ల, నంద్యాల చేనేత సహకార సంఘాలు ఉత్పత్తి చేస్తున్న చేనేత వస్త్రాలకు ఇండియన్ హ్యాండ్‌లూమ్ బ్రాండ్ ఇవ్వడానికి రిజిస్ట్రేషన్ కోసం ప్రాథమిక కార్యక్రమాలను పూర్తి చేశారు. దీనిపై ప్రత్యేక టీమ్ వచ్చి ఆయా సంఘాల్లో ఉత్పత్తి అవుతున్న చేనేత వస్త్రాలను పరిశీలిస్తుంది. అనంతరం ఇండియన్ హ్యాండ్ లూమ్ బ్రాండ్‌లో రిజిస్ట్రేషన్ చేస్తారని చేనేత, జౌళి శాఖ అధికారులు తెలిపారు. ఈ బ్రాండింగ్ వస్తే చేనేత వస్త్రాలకు మార్కెట్‌లో ఆదరణ లభించనుంది.

బ్యాంకు రుణాలు ఇస్తున్నారు



వంశపారంపర్యంగా చేనేత వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు అండగా నిలిచింది. నేతన్న నేస్తం పథకం ద్వారా ప్రతి ఏటా రూ. 24 వేలు ఆర్థికసాయం అందిస్తోంది. ఈ మొత్తంతో పట్టు చీరల తయారీకి కావాల్సిన సామగ్రిని సమకూర్చుకుంటున్నాం. చేనేత కార్మికులకు బ్యాంకు రుణాలు అందుతున్నాయి.

– రాజు, చేనేత కార్మికుడు, బిజనవేముల

ప్రభుత్వం అండగా నిలిచింది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేనేతకు మహర్దశ తీసుకొచ్చింది. కొన్నేళ్ల నుంచి నేత పరిశ్రమ నిర్వహిస్తున్నాం. గతంలో నేత పరిశ్రమను భారంగా నెట్టుకొచ్చేవాళ్లం. ప్రభుత్వం ఏటా అందిస్తున్న ఆర్థికసాయం మాకు ఎంతో ఆసరాగా నిలిచింది. కంచి, ధర్మవరం, ఉప్పాడ పట్టుచీరలు నేసి విక్రయిస్తున్నాం.

– లక్ష్మీదేవి, చేనేత కార్మికురాలు, బిజనవేముల

సుపరిపాలనే లక్ష్యం

- జిల్లా నూతన కలెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులు



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు

సాక్షి, నంద్యాల: ప్రభుత్వ ఆదేశాలను తుచా పాటిస్తూ సుపరిపాలన అందించడమే లక్ష్యంగా పని చేస్తానని జిల్లా నూతన కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయన జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు పరిచే సంక్షేమ పథకాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామన్నారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలు నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అందరి సమన్వయంతో కృషి చేస్తామన్నారు. జిల్లా అభివృద్ధికి ప్రజలు, ప్రజా ప్రతినిధులు సహాయ సహకారాలు అందించాలన్నారు. అనంతరం కలెక్టర్ చాంబర్‌లో ప్రథమనందీశ్వరాలయ అర్చకులతో వేదమంత్రాలతో ఆశీర్వాదం తీసుకున్నారు. అంతకుముందు నూతన జిల్లా కలెక్టర్ శ్రీనివాసులును జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, ఎస్పీ రఘువీర్ రెడ్డి, డీఆర్‌ఓ పుల్లయ్య తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు జిల్లా కలెక్టర్‌కు బొకేలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

టీడీపీ నేతలు బ్రోకర్ రాజకీయాలు మానుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి



సమావేశానికి తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

- జగనన్నను మరోసారి సీఎం చేసేందుకు ప్రజలు సిద్ధం
- చంద్రబాబు మాటలను ఎవరూ నమ్మరు
- శాప్ రాష్ట్ర చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

నందికొట్కూరు: తెలుగు దేశం పార్టీ నేతలు బ్రోకర్ రాజకీయాలు మానుకోవాలని శాప్ రాష్ట్ర చైర్మన్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి హితవు పలికారు. శుక్రవారం పట్టణంలోని మార్కెట్ యార్డులో నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం విజయవంతమైంది. సమావేశానికి ముందు వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీ బైక్ ర్యాలీలు నిర్వహించారు. బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్ తదితరులు వైఎస్సార్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సమావేశంలో సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మాయ మాటలతో మరోసారి మోసం చేయాలని చూస్తున్నారన్నారు. ఒంటరిగా పోటీ చేసే దమ్ము చంద్రబాబు నాయుడుకు ఉందా? అని ప్రశ్నించారు. ఈ నాలుగేళ్ల కాలంలో వేర్వేరు పార్టీల్లో ఉన్న బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, గౌరు వెంకటరెడ్డి, శివానందరెడ్డితో పాటు తాజా, మాజీ ఎమ్మెల్యేలు ఎన్నికల ముందు పటేల్ సెంటర్‌కు వచ్చి అభివృద్ధి కావాలంటే టీడీపీకి ఓట్లు వేయాలని అడిగితే ప్రజలు నిలదీయాలని కోరారు. గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ కేంద్రాలు, జగనన్న కాలనీలు, అసైన్‌మెంట్ పట్టాలు, రైతు గోడౌన్లు, వలంటీర్లు, పింఛన్ల పంపిణీని చూస్తే గుర్తుకు వచ్చేది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీయేనన్నారు. డ్వాక్రా మహిళలను చంద్రబాబు మోసం చేస్తే, సీఎం వైఎస్ జగనన్న ఆసరా పథకంతో ఆదుకున్నారన్నారు. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా వైఎస్సార్‌సీపీ గెలుపును ఎవరూ ఆపలేరని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న దారా సుధీర్


- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్ మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలకు తాను అండగా ఉంటానన్నారు. ఎలాంటి సమస్యలు వచ్చినా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉంటానని చెప్పారు. సీఎం జగనన్న సంక్షేమ పథకాలే వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపిస్తాయని స్పష్టం చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ షేక్ రహత్, ఎంపీపీలు మురళీకృష్ణారెడ్డి, మల్లేశ్వరి, వెంకటేశ్వరమ్మ, సువర్ణమ్మ, జెడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, జగదీశ్వరరెడ్డి, దివ్య, సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, శివరామకృష్ణారెడ్డి, మన్సూర్, నాగిరెడ్డి, రవియాదవ్, లోకేష్‌రెడ్డి, రామలింగేశ్వరరెడ్డి, రవికుమార్, జబ్బార్, ఉస్మాన్‌బేగ్, అబుబక్కర్, రామకృష్ణ, రమేష్ రెడ్డి, నాగరాజు, అక్తర్‌బాషా, శ్రీకాంత్, సులోచనమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను ఈ నెల 3న నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి ఉత్తర్వుల మేరకు గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, సాంఘిక సంక్షేమం, విద్య, వైద్యం, మహిళాభివృద్ధి-శిశు సంక్షేమం, ఆర్థిక-ప్రణాళిక, పనులకు సంబంధించిన శాఖలపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 3.30 గంటల వరకు ఏడు స్థాయీ సంఘ సమావేశాలను నిర్వహిస్తామన్నారు. సమావేశాలకు సంబంధిత స్థాయీ సంఘాల చైర్‌పర్సన్లు, సభ్యులు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు నిర్ణీత సమయానికి హాజరు కావాలని సీఈఓ కోరారు.

ఉమ్మడి జిల్లాలో 2,217 ఉపాధ్యాయ ఖాళీలు

- నోటిఫై చేసి ఖరారు చేయాలని జిల్లాకు జాబితా
- డీఎస్సీ ద్వారా భర్తీ చేసే అవకాశం
- ఎస్‌జీటీ 1,646, స్కూల్ అసిస్టెంట్ 571 పోస్టులు
- వీటికి అదనంగా రెసిడెన్షియల్, మున్సిపల్, ఏపీ మోడల్ స్కూళ్ల పోస్టులు పెరిగే అవకాశం



కర్నూలు సిటీ: రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్న ఉపాధ్యాయ పోస్టుల్లో సింహభాగం ఉమ్మడి కర్నూలు జిల్లాకు దక్కే అవకాశం ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాల విద్యలో 4,057 టీచర్ పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫై చేశారు. ఇందులో ఉమ్మడి కర్నూలు జిల్లాకు 2,217 పోస్టులు నోటిఫై అయ్యాయి. దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో 2008 డీఎస్సీ ద్వారా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2,683 పోస్టులు భర్తీ అయ్యాయి. నేడు ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో 2,217 పోస్టులు భర్తీ చేసే అవకాశం ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాఠశాల విద్యలో అనేక సంస్కరణలు తీసుకొచ్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతోపాటు ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా 2008 డీఎస్సీలో అర్హత పొంది ఉద్యోగాలు పొందలేకపోయిన వారితో పాటు 1998 డీఎస్సీ అర్హులకు మినిమం టైం స్కేల్‌తో ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇచ్చింది. 2024 డీఎస్సీలో జిల్లాలో విద్యార్థుల సంఖ్యకు తగ్గట్లు టీచర్ పోస్టులను భర్తీ చేసేందుకు 2,217 పోస్టులు విద్యాశాఖ నోటిఫై చేసింది. వీటికి రెసిడెన్షియల్, ఏపీ మోడల్ స్కూల్స్, ఆశ్రమ స్కూల్స్, మున్సిపల్ స్కూళ్లలోని ఖాళీలు అదనంగా జతకానున్నాయి. ప్రస్తుతం నోటిఫై చేసిన పోస్టులను అవసరమైన మేరకు ఖరారు చేసి జాబితాను శనివారం రాత్రికి కమిషనర్ ఆఫీస్‌కి డీఈఓ ఆధ్వర్యంలో పంపనున్నారు.

నిరుద్యోగులకు ఊరట..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు 2,865 ఉండగా, వీటిలో 4.57 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. మొత్తం 12,700 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం 15,298 మంది ఉపాధ్యాయులు ఉండాలి. ప్రస్తుతం 2,217 పోస్టులను నోటిఫై చేయడంతో నిరుద్యోగులకు ఊరట లభించింది. టీడీపీ హయాంలో 608 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి చేతులు దులుపుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఆ పోస్టులను భర్తీ చేసింది. నాలుగేళ్లలో జిల్లాలో 2018 డీఎస్సీ ద్వారా 608, 1998 డీఎస్సీ అభ్యర్థులకు 209, 2008 డీఎస్సీ అభ్యర్థులకు 204 టీచర్ ఉద్యోగాలు ఇచ్చింది. 2024 డీఎస్సీ ద్వారా ఇచ్చే పోస్టులతో కలిపితే మొత్తంగా 3,238 టీచర్ పోస్టులను భర్తీ చేసినట్లు అవుతుంది. మొదట టెట్ నిర్వహించి, ఆ తరువాత డీఎస్సీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ రెండు నోటిఫికేషన్లు వారం రోజుల్లో రానున్నాయి.

జిల్లాలో నోటిఫై చేసిన పోస్టుల వివరాలు..

క్యాటగిరీ పోస్టులు	ఖాళీల వివరాలు
స్కూల్ అసిస్టెంట్ (లాంగ్వేజ్-1)	84
స్కూల్ అసిస్టెంట్ (లాంగ్వేజ్-2)	113
స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష	43
స్కూల్ అసిస్టెంట్ గణితం	73
స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్	44
స్కూల్ అసిస్టెంట్ బయోలాజికల్ సైన్స్	44
స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్	35
స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్	135
ఎస్‌జీటీ (తెలుగు మీడియం)	1,614
ఎస్‌జీటీ (కన్నడ మీడియం)	32
మొత్తం పోస్టులు	2,217

శివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దాం



సమావేశంలో చర్చిస్తున్న చైర్మన్, ఈఓ, ధర్మకర్తలు

మహానంది: మహానంది క్షేత్రంలో మార్చి 6వ తేదీ నుంచి 11వ తేదీ వరకు నిర్వహించే శివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దామని ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. దేవస్థానంలోని చైర్మన్ కార్యాలయంలో శుక్రవారం ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ ఐదు రోజుల పాటు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తామన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఇటీవల వాయిదా పడిన వివిధ విభాగాలకు త్వరలోనే తిరిగి టెండర్లు నిర్వహిస్తామన్నారు. శ్రీ కామేశ్వరీదేవి అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలను డొనేషన్ కౌంటర్‌లో ఉంచి భక్తులకు విక్రయించేందుకు తీర్మానించామన్నారు. . సమావేశంలో ఏఈఓ మధు, ఆలయ సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

వెయ్యి కుటుంబాలు దత్తత



వైద్య విద్యార్థులతో అధ్యాపకులు, సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): ఫ్యామిలీ అడాప్షన్ ప్రోగ్రామ్‌లో భాగంగా నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆదేశాల మేరకు కర్నూలు మెడికల్ కాలేజీ మొదటి సంవత్సరం వైద్య విద్యార్థులు వెయ్యి కుటుంబాలను కర్నూలులో దత్తత తీసుకున్నారు. ఈ ప్రోగ్రామ్‌లో వైద్య విద్యార్థులు 4 సంవత్సరాల పాటు ఆయా కుటుంబాలకు నిరంతర ఆరోగ్య పరిరక్షణ నిర్వహిస్తారు. శుక్రవారం ఈ కార్యక్రమానికి సంబంధించి వైద్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సామాజిక వైద్య శాస్త్ర విభాగం(ఎస్‌పీఎం)హెచ్‌వోడి డాక్టర్ సుధాకుమారి, ప్రొఫెసర్ డాక్టర్ సింథియా శుభప్రద, డాక్టర్ యు.వెంకటేశ్వర్లు, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

డొలమైట్ అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్

కర్నూలు (న్యూటౌన్): డొలమైట్‌ను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను డోన్ మండలం హెచ్ కొట్టాల వద్ద సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ట్రాక్టర్ యజమానులకు రూ.20వేల అపరాధం రుసుం విధించి, వసూలు చేశామన్నారు.

తొలగిన దా'రుణ' బాధలు

- టీడీపీ హయాంలో 40 మంది రైతుల ఆత్మహత్యలు
- పరిహారం అందించి ఆదుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం


ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు పరిహారం చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి(ఫైల్)

తుగ్గలి: అప్పుల బాధతాళలేక ఆత్మహత్యలకు పాల్పడిన అన్నదాత కుటుంబాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా నిలిచింది. ఇంటి పెద్దను కోల్పోయిన కుటుంబాలు వీధిన పడకుండా, తలెత్తుకొని జీవనం సాగించేలా ఆర్థికసాయం అందించింది. టీడీపీ హయాంలో ఆత్మహత్య చేసుకున్న అన్నదాత కుటుంబాలకు పరిహారం అందించి మానవత్వాన్ని చాటుకుంది. రుణమాఫీ అమలు చేయకుండా 2014 నుంచి 2019 వరకు టీడీపీ అధినేత చంద్రబాబు రైతులను మోసం చేశారు. దీంతో అప్పుల బాధతాళలేక టీడీపీ హయాంలో కర్నూలు జిల్లాలో 40 మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వీరిలో 17 మంది రైతు కుటుంబాలు తుగ్గలి మండలానికి చెందినవి ఉన్నాయి. అప్పటి టీడీపీ ప్రభుత్వం బాధిత కుటుంబాలను పట్టించుకోలేదు. పరిహారం అందించకుండా మొండిచేయి చూపింది. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆత్మహత్య చేసుకున్న అన్నదాతల కుటుంబాలను ఆదుకుంది. ఒక్కొక్క కుటుంబానికి రూ.5లక్షల చొప్పున 40 మంది కుటుంబాలకు రూ.1.96 కోట్లు పరిహారం అందజేసింది. కర్షకుల కష్టాలు తొలగిస్తూ.. రైతు భరోసా పథకం కింద ఏటా పెట్టుబడి సాయం అందిస్తోంది. అయినప్పటికీ అక్కడక్కడ అప్పులతో కొందరు రైతులు బలవన్మరణం పొందారు. వారి కుటుంబాలను ఆదుకునేందుకు ఒక్కో కుటుంబానికి ఆలస్యం లేకుండా రూ.7లక్షల చొప్పున పరిహారం అందిస్తోంది. బాధిత రైతు కుటుంబాల కన్నీరు తుడుస్తోంది.

టీడీపీ మోసం చేసింది



పంటలు పండక చేసిన అప్పులు తీర్చే మార్గం లేక 2015 జూన్‌లో నా భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన మృతితో చాలా ఇబ్బందులు పడ్డాం. టీడీపీ పరిహారం ఇవ్వకుండా మోసం చేసింది. భర్త చనిపోయి మూడేళ్లనా పింఛన్ కూడా ఇవ్వలేదు. జగన్ సీఎం అయ్యాకే పరిహారం రూ.5లక్షలు అందింది. పింఛన్ కూడా మంజూరు చేశారు. చేయూత కింద రెండుసార్లు రూ.38 వేలు వచ్చాయి. మా కుటుంబాన్ని అన్ని విధాలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకున్నారు.

–బంగి సంజమ్మ, రాతన, తుగ్గలి మండలం

దేవుడిలా ఆదుకున్నారు



పంటలు పండక చేసిన అప్పులు రూ.5 లక్షలకు చేరుకున్నాయి. వాటిని తీర్చలేక నా భర్త బిజ్జె గిడ్డయ్య 2018 జూన్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. టీడీపీ ప్రభుత్వం పరిహారం ఇవ్వలేదు. చేసిన అప్పు ఎలా తీర్చాలని రోజూ బాధపడేదాన్ని. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక దేవుడిలా ఆదుకున్నారు. రూ.5లక్షల పరిహారం నేరుగా నా బ్యాంకు ఖాతాకే జమ చేశారు. ఆ డబ్బుతో అప్పులు కట్టుకున్నా. ఇప్పుడు సంతోషంగా వ్యవసాయం చేసుకుంటున్నా. కష్టాల్లో ఉన్న మా కుటుంబాన్ని ఆదుకున్న జగన్‌కు రుణపడి ఉంటాం.

– కౌలుట్లమ్మ, ముక్కెళ్ల

జర్నలిస్టు ఇళ్ల స్థలాల ప్రక్రియ వేగవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో కె.మధుసూదన్‌రావు

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల మంజూరు కోసం వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని డీఆర్వో కె.మధుసూధన్‌రావు తహసీల్దార్లను ఆదేశించారు. శుక్రవారం డీఆర్వో తన చాంబర్‌లో జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు సంబంధించిన అంశంపై ఆర్‌డీఓ హరిప్రసాదు, తహసీల్దార్లతో సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ 535లోని నిబంధనలు మేరకు దరఖాస్తులను పరిశీలించాలన్నారు. సమాచార శాఖ నుంచి వచ్చిన 368 దరఖాస్తులను మండలాలకు పంపామని, ఏ మండలానికి వచ్చిన దరఖాస్తులను ఆయా తహసీల్దార్లు పరిశీలించి పంపాలని ఆదేశించారు. సమావేశంలో కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, తహసీల్దార్లు రమేష్‌బాబు, విజయశ్రీ, శివరాముడు, జయన్న పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు 'వ్యక్తిత్వ' శిక్షణ


వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న సెట్కూరు సీఈవో పీవీ రమణ తదితరులు

కర్నూలు(హాస్పిటల్): పదో తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస నిపుణులతో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సెట్కూరు సీఈవో పీవీ రమణ చెప్పారు. శుక్రవారం సెట్కూరు కార్యాలయంలో హ్యాపీ ఎగ్జామ్స్‌పై అవగాహన కార్యక్రమానికి సంబంధించి వాల్‌పోస్టర్‌ను పీవీ రమణ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెట్కూరు–యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఫిబ్రవరి, మార్చి నెలల్లో 10వ తరగతి విద్యార్థులకు హ్యాపీ ఎగ్జామ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిష్ణాతులైన వ్యక్తిత్వ వికాస నిపుణులతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు పదో తరగతి తర్వాత విద్యావకాశాలపై వివరిస్తారన్నారు. వ్యక్తిత్వ వికాసం, ఉన్నత విద్యావకాశాలు తెలిపే కరపత్రిక, బుక్‌లెట్ అందజేస్తామన్నారు. త్వరలో యువజన సర్వీసుల శాఖ ద్వారా మై కెరీర్ అనే మొబైల్ యాప్‌ను యువతకు అందుబాటులో ఉంచుతున్నట్లు ఆయన వివరించారు. గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సెట్కూరు కార్యాలయాన్ని నేరుగా గానీ, ఫోన్‌నంబర్ 8688361250, 9849909070 ద్వారా సంప్రదించి కార్యక్రమాన్ని తమ పాఠశాలల్లో ఏర్పాటు చేయించుకోవాలని కోరారు.సెట్కూరు మేనేజర్ సత్యనారాయణ, వ్యక్తిత్వ వికాస నిపుణులు రాజశేఖర్ పాల్గొన్నారు.

పార్వేట పల్లకీకి ఊరూరా ఘన స్వాగతం


పడకండ్లలో ఊరేగుతున్న ఉత్సవ పల్లకి

ఆళ్లగడ్డ: తన వివాహ మహోత్సవానికి భక్తజనాన్ని ఆహ్వానించేందుకు పల్లెలకు వెళ్తున్న అహోబిలేశుడికి ఊరూరా భక్తులు స్వాగతం పలుకుతున్నారు. శుక్రవారం పడకండ్ల గ్రామానికి పల్లకీలో చేరుకున్న ప్రహ్లాదవరదస్వామి, జ్వాలనరసింహస్వామికి ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చి పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీని గ్రామస్తులు భుజాలపై మోసుకుంటూ తెలుపులపై కొలువుంచుతూ భక్తిని చాటుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా అహోబిలేశుడి ఉత్సవ పల్లకీ శనివారం ఉదయం ఆళ్లగడ్డ పట్టణానికి చేరుకుంటుంది.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న డీఈఓ సుధాకర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ అండ్ టెక్నాలజీ సిమ్యులేషన్‌పై ఇస్తున్న శిక్షణను గణిత ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో జరిగిన సర్వశిక్ష అభియాన్ ఆంధ్రప్రదేశ్ ఆదేశాల మేరకు ఆరు సెంటర్లలో గణిత ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఈఓ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు ఇంటర్ యాక్టివ్ ప్లాట్‌ప్యానల్ (ఐఎఫ్‌పీ) 8, 9, తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు, ప్రాథమిక పాఠశాలలకు స్మార్ట్ టీవీలు ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. తరగతి బోధన, టెక్నాలజీ ఉపయోగించుకోవాలన్నారు. సమర్థవంతంగా బోధించడానికి విద్యార్థులకు గ్లోబల్ లెవెల్‌లో పోటీలో నిలపడటానికి ఎన్నో సౌకర్యాలు కల్పించిందన్నారు. ఇందులో భాగంగానే గణిత, భౌతిక, జీవశాస్త్రంలో బోధించే ఉపాధ్యాయులకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఉపాధ్యాయులు తరచుగా పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు నూతన పద్ధతి ద్వారా విద్యాబోధన చేయాలన్నారు. అనంతరం పలు సూచనలు ఇచ్చారు. ఐసీటీ సిమ్యులేషన్ జిల్లా కో ఆర్డినేటర్ నాగేంద్రకుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు కొత్త టెక్నాలజీని ఈ శిక్షణ పరిచయం చేస్తుందన్నారు. శిక్షణలో పాఠశాల హెచ్‌ఎంలు పద్మావతి, రీసోర్స్ పర్సన్‌లు జగన్‌మోహన్‌రెడ్డి, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వీరాంజనేయ స్వామివారి దేవస్థానము
గండి క్షేత్రము
మారెళ్ళమడక (గ్రా), చక్రాయపేట (మం), వై.యస్.ఆర్. కడప జిల్లా, ఫోన్ నెం.: 9949242438

'e' Procurement Tender మరియు టెండర్ కమ్ బహిరంగ వేలము

ఈ క్రింద తెలిపిన హక్కులకు 12 నెలల కాలము అనగా 01.03.2024 to 28.02.2025 వరకు గల లైసెన్సును ఇ-టెండరు/ సీల్డ్ టెండర్ మరియు బహిరంగ వేలము ద్వారా 14.02.2024 తేదీన ఉదయము 10.00 గంటలకు నిర్వహించబడును.

క్రమ సంఖ్య	హక్కు పేరు	డిపాజిట్ మొత్తము
1.	భక్తాదులు సమర్పించు తలనీలాలు ప్రోగుచేసుకొను హక్కు 01.03.2024 to 28.02.2025	రూ.20,00,000-00
2.	కొబ్బరి చిప్పలు ప్రోగుచేసుకొను హక్కు 01.03.2024 to 28.02.2025	రూ.2,00,000-00

హెచ్చుపాటదారుడు పాట ముగిసిన వెంటనే డిపాజిట్‌తో కలిపి సగభాగ మొత్తము అదే రోజున చెల్లించవలెను. మరిన్ని వివరములు www.apeprocurement.gov.in (లేదా) https://tender.apeprocurement.gov.in ద్వారా తెలుసుకొనవచ్చును.

కావలి క్రిష్ణ తేజ, చైర్మన్
సం/- అలవలపాటి ముకుంద రెడ్డి, సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వాహణాధికారి

సీఐలకు స్థానచలనం

కర్నూలు: కర్నూలు రేంజ్ వీఆర్‌లో ఉన్న పలువురు సీఐలను స్టేషన్లకు కేటాయిస్తూ ఎస్పీ కృష్ణకాంత్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే మరో ఐదుగురు సీఐలను ప్రస్తుతం పనిచేస్తున్న స్థానాల్లోనే రెగ్యులర్‌గా నియమించారు. పవన్‌కుమార్, సోమశేఖర్‌రెడ్డి.. కర్నూలు వన్‌టౌన్, వై.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పత్తికొండ రూరల్, సురేష్ కుమార్ రెడ్డి వెల్దుర్తి సర్కిల్, గౌతమి కర్నూలు ట్రాఫిక్‌లో రెగ్యులర్‌గా నియమిస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు వీఆర్‌లో ఉన్న ఎం.నాగశేఖర్, కె.శ్రీరాం, కె.శ్రీనివాస నాయక్, యు.లక్ష్మయ్య, ఎం.ఆదిలక్ష్మమ్మ, ఎం.ఉపేంద్ర బాబులను కర్నూలు రేంజ్ వీఆర్‌కి బదిలీ చేశారు.

పేరు	ప్రస్తుతం	కేటాయించిన స్టేషన్
ఎం.శ్రీధర్	కర్నూలు రేంజ్ వీఆర్	కర్నూలు అర్బన్ తాలూకా
ఎ.రామకృష్ణయ్య	కర్నూలు రేంజ్ వీఆర్	గోనెగండ్ల యూపీఎస్
ఎ.వేణుగోపాల్	కర్నూలు రేంజ్ వీఆర్	సోషల్ మీడియా అండ్ సైబర్ క్రైం సెల్
ఎ.జయన్న	కర్నూలు రేంజ్ వీఆర్	కర్నూలు ఫ్యాక్షన్ జోన్
ఎన్.వెంకటరమణ	కర్నూలు రేంజ్ వీఆర్	కర్నూలు సీసీఎస్
ఎల్.విజయలక్ష్మి	కర్నూలు రేంజ్ వీఆర్	ఆదోని పీసీఆర్
డి.హాజీవలి	కర్నూలు రేంజ్ వీఆర్	కర్నూలు దిశ పీఎస్
రామయ్య నాయుడు	ఆదోని పీసీఆర్	కర్నూలు త్రీటౌన్ (అడిషనల్ పోస్టు)

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఉమ్మడి జిల్లాల ఆర్‌ఐఓ గురువయ్యశెట్టి అన్నారు. ఈ మేరకు శుక్రవారం నంద్యాలలో ప్రిన్సిపాళ్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 5వ తేదీన వొకేషనల్ విద్యార్థులకు, 11వ తేదీ నుంచి జనరల్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. జిల్లాలో 66 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రాక్టికల్ పరీక్షలకు సైన్స్ విద్యార్థులు 7,591 మంది, అలాగే వొకేషనల్ విద్యార్థులు 2,389 మంది హాజరు అవుతారని తెలిపారు. మార్చి 1 నుంచి ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో కూడా సన్నద్ధం కావాలని తెలిపారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులు 13,553 మంది, సెకండియర్ విద్యార్థులు 14,846 మంది పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. పబ్లిక్ పరీక్షలకు 52 కేంద్రాలు ఏర్పాటు చేశామని ఆర్‌ఐఓ వివరించారు.

హెడ్‌కానిస్టేబుల్ కుటుంబానికి సహోద్యోగుల చేయూత


తిమ్మన్న కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న ఎస్పీ

కర్నూలు: గుండెపోటుతో మృతిచెందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ పి.తిమ్మన్న కుటుంబానికి సహోద్యోగులు చేయూతనందించారు. 2023 డిసెంబర్ 15న తిమ్మన్న విధి నిర్వ హణలో గుండెపోటుతో మరణించారు.ఈయనకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. ఇద్దరు కుమార్తెలకు మాత్రమే వివాహమైంది. దీంతో ఆ కుటుంబం ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నట్లు తెలుసుకుని ఆర్థిక సాయం అందించి అండగా నిలిచేందుకు 1994వ బ్యాచ్‌కు చెందిన కర్నూలు, అనంతపురం, ప్రకాశం, చిత్తూరు, తిరుప తి,హైదరాబాద్, నంద్యాల జిల్లాల్లో పనిచేస్తున్న సివిల్, ఏఆర్ ఏపీఎస్పీ పోలీసులు ముందుకొచ్చారు. తమ వంతు సహాయంగా సేకరించిన రూ.2.12 లక్షలను ఇద్దరు పెళ్లి కాని కుమార్తెల పేరు మీద ఒక్కొక్కరికి రూ.1.06 లక్షలు పోస్టాఫీసులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశా రు. ఇందుకు సంబంధించిన బాండ్‌లను ఎస్పీ కృష్ణకాంత్ చేతుల మీదుగా శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ నాగబాబు, ఆర్‌ఐలు పోతల రాజు, జావెద్, 1994వ బ్యాచ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్తి కోసమే ఘాతుకం

- తల్లిని చంపిన కేసులో కుమారుడి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన పోలీసులు


నిందితులను అరెస్టు చూపుతున్న సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ మల్లికార్జున, పోలీసు సిబ్బంది

పత్తికొండటౌన్: ఆస్తి కోసమే కన్నతల్లిని పచ్చర్ల లిఖిత్ కుమార్‌రెడ్డి హత్య చేసినట్లు పోలీసులు విచారణలో తేలింది. అతనితోపాటు, హత్యకు ప్రోత్సహించిన పెద్దనాన్న పచ్చర్ల లింగారెడ్డిని అరెస్టు చేసినట్లు పత్తికొండ రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తుగ్గలి ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. అరెస్టు చేసిన నిందితులను శుక్రవారం కోర్టులో హాజరుపరిచి, మీడియాకు వివరాలు వెల్లడించారు. తుగ్గలి మండలం రాతన కొత్తూరు గ్రామంలో ఈనెల 19న పచ్చర్ల లక్ష్మీదేవి హత్యకు గురైంది. ఈ కేసు దర్యాప్తు ముమ్మరం చేయడంతో నిందితులైన లిఖిత్‌కుమార్‌రెడ్డి, లింగారెడ్డి రాతన వీఆర్‌ఓ ద్వారా తుగ్గలి పోలీసుస్టేషన్‌లో లొంగిపోయారు. రాతన కొత్తూరు గ్రామానికి చెందిన కృష్ణారెడ్డికి భార్య లక్ష్మీదేవి, కుమారుడు లిఖిత్‌కుమార్ రెడ్డి ఉండేవారు. వారికి 11.06 ఎకరాల భూమి ఉండేది. ఆయన తన భార్య, కుమారుడు పేరు మీద 5.46 ఎకరాల భూమిని జాయింట్ రిజిస్ట్రేషన్ చేయించాడు. ఏడు సంవత్సరాల క్రితం క్రిష్టారెడ్డి అనారోగ్యంతో మృతిచెందాడు. భర్త మరణించిన తర్వాత లక్ష్మీదేవి తన పేరు మీద మరో 3.19 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ చేయించుకుంది. ఈ విషయంలో తల్లి, కొడుకుల మధ్య విభేదాలు తలెత్తాయి. లక్ష్మీదేవి తన తల్లి గారి ఊరైన రాతనకు వచ్చి నివాసం ఉంటోంది. లిఖిత్‌కుమార్‌రెడ్డి రాతన కొత్తూరు గ్రామంలోనే పెద్దనాన్న లింగారెడ్డి ఇంట్లోనే ఉండేవాడు. తల్లి పేరు మీద ఉన్న భూమిని తన పేరు మీద రాసి ఇవ్వాలని కోరగా, నీ పెళ్లి అయిన తర్వాత రాసి ఇస్తా అని చెబుతుండేది. తన తల్లిని చంపితే ఆస్తి మొత్తం తనకే దక్కుతుందని లిఖిత్‌కుమార్‌రెడ్డి భావించాడు. తనకు పెళ్లి చూపులు చూడటానికి వస్తున్నారని తల్లికి అబద్ధం చెప్పి గ్రామానికి పిలిపించి, భూమి విషయమై గొడవ పెట్టుకుని వ్యవసాయ పనిముట్టు మేడితోక తీసుకుని తలపై బాది చంపివేశాడు. పెద్ద నాన్న ప్రోత్సాహంతోనే హత్యచేసినట్లు నిర్ధారించిన పోలీసులు ఇద్దరిని నిందితులుగా చేర్చారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా, మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ తెలిపారు.

ఊరికి పంపలేదని..

- అలిగి వెళ్లిపోయిన చిన్నారులు
- రాత్రంతా వామిదొడ్డిలోనే
- క్షేమంగా ఇంటికి చేరిన బాలికలు


తల్లిదండ్రులతో చిన్నారులు

మద్దికెర: తమను ఊరికి పంపలేదని ఇద్దరు చిన్నారులు ఇంటి నుంచి అలిగి వెళ్లిపోయారు. రాత్రంతా వామిదొడ్డిలో దాక్కుని ఉదయం ప్రత్యక్షమయ్యారు. ఎస్ఐ రిజ్వాన్ మహమ్మద్ తెలిపిన వివరాల మేరకు.. ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన ఉజ్వల, అపూర్వ అనే ఇద్దరు చిన్నారులతో తల్లిదండ్రులు రెండు రోజుల క్రితం పత్తికొండలో బంధువుల ఇంటికి పోదామని చెప్పారు. అయితే రెండు రోజులు గడిచినా పిలుచుకొని పోకపోడంతో బ్యాగులో బట్టలు సర్దుకొని గురువారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయారు. ఆడుకునేందుకు వెళ్లారని భావించిన తల్లిదండ్రులు రాత్రి అయినా పిల్లలు ఇంటికి రాకపోవడంతో కంగారు పడ్డారు. తెలిసిన వారి ఇళ్లలో వెతికినా దొరకలేదు. గ్రామంలో ఇద్దరు వ్యక్తులు తిరిగారని వాళ్లే తమ పిల్లలను కిడ్నాప్ చేశారని భావించి పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన పోలీసులు తమ సిబ్బందితో వెతికినా ఫలితం లేకపోవడంతో డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. దారిలో బ్యాగు పడి ఉండటాన్ని డాగ్ స్క్వాడ్ పసిగట్టాయి. అక్కడ ఉన్నారని వెతికినా ఆచూకీ లభించలేదు. అయితే ఇద్దరు బాలికలు గ్రామం వెలుపల ఉన్న వామిదొడ్డిలో రాత్రంతా దాక్కున్నారు. తెల్లవారిన తరువాత శుక్రవారం ఉదయం బయటికి రావడంతో అటుగా వెళుతున్న రైతులు గమనించి సమాచారం అందించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పిల్లలను తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

38 మంది ఎంపీడీఓలకు పోస్టింగ్స్

కర్నూలు(అర్బన్): అనంతపురం, వైఎస్సార్ జిల్లాల నుంచి ఉమ్మడి కర్నూలు జిల్లాకు బదిలీపై వచ్చిన 38 మంది ఎంపీడీఓలకు జిల్లాలో పోస్టింగ్స్ ఇచ్చినట్లు జిల్లా పరిషత్ సీఈఓ జీ నాసరరెడ్డి తెలిపారు. సాధారణ ఎన్నికల్లో భాగంగా ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలకు అనుగుణంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 40 మంది ఎంపీడీఓలను ఆయా జిల్లాలకు బదిలీ చేయగా, వారి స్థానంలో అనంతపురం నుంచి 23, వైఎస్సార్ జిల్లా నుంచి 15 మంది వచ్చారన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వీరందరిని కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని మండలాలకు నియమించామన్నారు. వారు వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించారు.

ఎంపీడీఓ పేరు	పోస్టింగ్ ఇచ్చిన మండలం	ఎంపీడీఓ పేరు	పోస్టింగ్ ఇచ్చిన మండలం
ఏవీ శ్రీనివాసులు	డోన్	కే ఆజాద్	హొళగుంద
టీ లక్ష్మీనారాయణ	ఆస్పరి	జీ విజయలక్ష్మి	తుగ్గలి
జీవీ రవిప్రసాద్	బేతంచెర్ల	జీ కిరణ్‌మోహన్‌రావు	నందవరం
జీ మునెప్ప	మంత్రాలయం	ఎన్ రంగనాథగుప్త	కౌతాళం
ఎస్ సాయిమనోహర్	ప్యాపిలి	జీ సౌభాగ్యమ్మ	నంద్యాల
జీ గంగావతి	మిడుతూరు	ఏవీ రమణారెడ్డి	ఆళ్లగడ్డ
కెఎన్ నరేష్‌కృష్ణ	నందికొట్కూరు	ఎన్ భాగ్యలక్ష్మి	పాణ్యం
జీ రామారావు	పత్తికొండ	సీఏ జవహర్‌బాబు	కొత్తపల్లి
పీ నరేంద్రకుమార్	ఆలూరు	పీ జయశ్రీ	గూడూరు
టీ అలివేలమ్మ	మద్దికెర	ఏ మల్‌రెడ్డి	అవుకు
ఎన్ బరేన్‌సాహెబ్	చిప్పగిరి	ఎస్ విజయరావు	బండిఆత్మకూరు
ఎం నరసింహనాయుడు	కర్నూలు	ఎం దివ్య	కోడుమూరు
సీఎల్ సోనీబాయి	గోనెగండ్ల	ఎన్ రామచంద్ర	రుద్రవరం
కేవీ కవిరాజు	పగిడ్యాల	బి మల్లేశ్వరి	ఓర్వకల్లు
జీ శకుంతల	సి బెళగల్	ఎస్ శ్రీనివాసరెడ్డి	ఆత్మకూరు
ఎం కొండన్న	ఎమ్మిగనూరు	ఎన్ శివరామిరెడ్డి	గడివేముల
వీ సరస్వతి	పాములపాడు	జీవీ రఘురామ్	ఉయ్యాలవాడ
ఎన్ శివశంకరప్ప	వెల్దుర్తి	ఎస్ ఫణిరాజకుమారి	శిరివెళ్ల
డీ రాబర్ట్‌విల్సన్	కృష్ణగిరి	బి సూర్యనారాయణరెడ్డి	చాగలమర్రి

ముగిసిన జిల్లాస్థాయి 'ఆడుదాం- ఆంధ్రా' పోటీలు


వాలీబాల్‌లో తలపడుతున్న బాలికలు

- నేడు విజేతలకు ట్రోఫీల ప్రదానం


విజేతలకు అందజేయనున్న ట్రోఫీలు

కర్నూలు (టౌన్): నగరంలోని స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియం, ఇండోర్ స్టేడియాల్లో మూడు రోజులుగా కొనసాగుతున్న జిల్లా స్థాయి ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీలు శుక్రవారం సాయంత్రం ముగిశాయి. క్రికెట్, కబడ్డీ, ఖో-ఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్ క్రీడాంశాల్లో జిల్లాలోని అన్ని నియోజకవర్గ జట్లు పోటీ పడ్డాయి. క్రికెట్‌లో ఫైనల్ పోరు కర్నూలు వర్సస్ పాణ్యం జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన కర్నూలు జట్టు ఫీల్డింగ్ ఎంచుకొంది. బరిలో దిగిన పాణ్యం జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 122 పరుగులు చేసింది. కర్నూలు జట్టు 9.3 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 123 పరుగులు చేసి విజయం సాధించి ఆడుదాం- ఆంధ్రా రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈనెల 6న విశాఖపట్నంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుంది. కబడ్డీ పురుషుల విభాగంలో ఎమ్మిగనూరు, ఆలూరు, కర్నూలు , బాలికల విభాగంలో పత్తికొండ, మంత్రాలయం, ఆలూరు జట్టు మొదటి మూడుస్థానాల్లో నిలిచాయి. వాలీబాల్ మహిళల విభాగంలో కర్నూలు, కోడుమూరు, ఆలూరు, బ్యాడ్మింటన్ బాలికల విభాగంలో పాణ్యం, ఎమ్మిగనూరు, కోడుమూరు, ఖో-ఖో బాలికల విభాగంలో పత్తికొండ, ఆలూరు, ఎమ్మిగనూరు జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. మొదటి స్థానంలో నిలిచిన జట్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నాయి. శనివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో విజేతలకు ట్రోఫీలను బహూకరించనున్నారు.

మొలగవల్లి డాక్టర్ సరెండర్

ఆలూరు రూరల్: విధులకు హాజరుకావడం లేదని గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టి డాక్టర్ శాంతిని సరెండర్ చేస్తూ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గత నెల 23న ఆదోని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతి మొలగవల్లి పీహెచ్‌సీకి వెళ్లి విచారణ జరిపారు. గ్రామస్తుల ఫిర్యాదు నిజమని తేలడంతో నివేదికను వైద్యశాఖ ఉన్నతాధికారులకు పంపారు. దీంతో డాక్టర్ శాంతిని పీహెచ్‌సీ నుంచి రిలీవ్ చేస్తూ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ విజయవాడ కార్యాలయంలో రిపోర్ట్ చేసుకో వాల్సిందిగా ఉత్తర్వులు ఇచ్చారు. ఆస్పరి మండలం ములుగుందం పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ రఘురామిరెడ్డికి మొలగవల్లి పీహెచ్‌సీ బాధ్యతలు అప్పగించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ ఉచిత శిక్షణ మరియు ఉపాధి అవకాశాలు గ్రామీణ నిరుద్యోగ యువతి యువకులకు నాలుగు నెలల కాల వ్యవధిలో కంప్యూటర్ హార్డ్వేర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, కోర్సులలో ఉచిత శిక్షణ, భోజన వసతి సదుపాయం, కేంద్ర ప్రభుత్వంచే గుర్తించబడిన సర్టిఫికెట్, అర్హతను బట్టి ఉపాధి అవకాశాలు కల్పించబడును. Nihar Skill Education, Kadapa. Ph: 9063082227, 9966448807 [C-1249531]

DISTANCE DEGREE & PG
■ Degree: B.Com- CA, BBA, BA, BCA, B.Sc, B.Com BLiSc, PG, MA, MBA, MCA, MSC, M.Com MSW, MLiSc. Sri Vijayadurga Degree College, Kurnool : Contact: 90306 28410, 93937 28410. [L-806357]

REAL ESTATE
■ ఎర్రచందనము 2సం॥ మొక్కలతో కనిగిరిలో 5 సెంట్ల భూమి 20 మొక్కలు కలిపి రూ.2 లక్షలు/ 11సెంట్ల భూమి 50 మొక్కలు కలిపి రూ.3 లక్షల 50 వేలు. సులభ వాయిదా పద్ధతి కలదు. మండలాల వారిగా మేనేజర్స్ కావలెను. వెంటనే సంప్ర॥ ✆ 73969 29808 [O-758398]

PLOT FOR SALE
■ వేగంగా అభివృద్ధి అవుతున్న కర్నూలు-నందికొట్కూరు మెయిన్ రోడ్డులో కుడ అప్రూవుడ్‌తో నంద్యాల చెక్‌పోస్ట్‌కు 4 కి.మీ. దూరంలో ఓపెన్ ప్లాట్లు బ్యాంక్ లోన్‌తో కలవు. సెల్: 9533049765. [L-822342]

■ ప్లాట్లు..ప్లాట్లు.. కర్నూలు-నంద్యాల రోడ్డు, డోన్ రోడ్డు నందు 2.75 సెంట్లు కేవలం 3 లక్షల నుండి 15 లక్షల వరకు అన్ని డెవలప్‌మెంట్స్‌తో కలవు. మరియు నన్నూరు, ఓర్వకల్లు, హుసేనాపురం, తిప్పాయిపల్లె, చిన్నటేకూరు, ఉల్లిందకొండ బైపాసు నందు మరియు ఎల్.పేట, కోడుమూరు రోడ్డు, అలంపూర్ చౌరస్తా నందు ప్లాట్లు కలవు. సెల్: 80746 66099, 99899 96221. [L-822329]

FLAT FOR SALE
■ Ganesh Nagar (Nandikotkur Road To Jolapuram Road) 60 Feet Road Facing 3BHK (1600 SFT) 2BHK 1150 SFT New Flats For Sale. Contact: 9618922589. [HA-31036]

SERVICES
బంగారం కొనబడును
■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647 [V-6384]

BUSINESS OFFER
■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్టును అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేక్ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9773917835. [T-1261198]

WANTED
■ ప్రముఖ విద్యాసంస్థలో అకౌంటెంట్‌గా పనిచేయుటకు అనుభవం గల అభ్యర్థులు కావలెను. కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలి. అర్హత: B.Com/M.Com/MBA. సెల్: 9912343454, 9912340919. [L-822343]

■ కర్నూలు నగరంలో ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీకి మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. Salary+Attractive ఇన్సెంటివ్స్. సం.ప్ర: సెల్: 77788 83692. [L-146]

■ ప్రముఖ ఎడ్యుకేషనల్ సంస్థ నందు పనిచేయుటకు లేడి టెలికాలర్స్ PRO's కావలెను. జీతం+ఇన్సెంటివ్స్. సంప్ర: మెడికల్ కాలేజి ఎదురుగా, బుధవారపేట, కర్నూలు. 91771 77289, 89193 00841 [L-806355]

■ Wanted Bank Field verification Executives. Kurnool, Pattikonda, Kodumur, Orvakallu, Veldurthi. Further Details Contact : 72888 03402, 79818 01911. [NA-6230]

■ Wanted Staff: Sales Manager/Sales Executives/WorkShop Manager/Service Advisor/ Customer Care Executive and Spare Parts Incharge For PAVAN RACERS, TVS Motor Showroom, Arts College Road, ADONI - 94402 50250. [L-481]

■ పారుల్ యూనివర్శిటీ బ్రాండ్ ప్రమోషన్ కొరకు టెలికాలర్స్ కావలెను. వయస్సు: 21-28సం॥ సంప్ర॥ నవీన్ చంద్ కొత్త అయ్యప్పస్వామిగుడి, కె.సి.కెనాల్, కర్నూలు. 9381049149 [G-8210]

■ ఉచితంగా కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీష్, ఎలక్ట్రీషన్ & బ్రాడ్‌బ్యాండ్ టెక్నీషియన్ కోర్సును నేర్పించి ఉద్యోగం చూపించబడును. ఉచిత వసతి+భోజనం. వ:18-35సం॥, గుంటూరు. ✆ 9133444985/ 89 [G-824404]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ: 18K. ఫోన్: 9160900024/9640400073. [HA-1168]

■ జాబ్ గ్యారంటీ జీతం: 18-30 వేల వరకు, ఫ్రీరూం+భోజనం ఇచ్చి మహిళలు/పురుషులకు జాబ్స్. ఏజెంట్లు కావలెను. (1 మనిషికి 5000/- కమీషన్). ఫోన్: 8886733009. [HA-10848]

■ కన్సల్టెన్సీ కాదు.VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ : 15000 -40000, ఫ్రీ రూమ్+భోజనం. Hyd. 7993583999 [HA-1179]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.